సాక్షి

బాపట్ల

సోమవారం । 15 । మే । 2023




## మంత్రి అంబటి పూజలు

రాజుపాలెం: కొండమోడు సమీపంలోని వేంకటకోటియోగేంద్రుల స్వామిని మంత్రి అంబటి రాంబాబు ఆదివారం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



## భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది.

## కరోనా @ జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.



## న్యూస్‌రీల్

### కోటప్పకొండపై కలెక్టర్ ట్రెక్కింగ్



నరసరావుపేట రూరల్: ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం కోటప్పకొండపై జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి కుటుంబసభ్యులతో కలిసి ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. కొండపైన ప్రధాన ఆలయానికి చేరుకుని ముందుగా త్రికోటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి ట్రెక్కింగ్ చేస్తూ పాత కోటయ్య స్వామి దేవస్థానానికి చేరుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అక్కడ నుంచి కోటప్పకొండ అందాలను వీక్షించారు. జిల్లాలో సాహస క్రీడలను ప్రోత్సహించేందుకు కొండవీడు, కోటప్పకొండపై ట్రెక్కింగ్ ఏర్పాటుచేసినట్టు కలెక్టర్ శివశంకర్ తెలిపారు.

### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 521.70 అడుగుల వద్ద ఉంది. ఇది 152.3944 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి విడుదలవుతున్న నీటిని నిలిపివేశారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.20 అడుగుల వద్ద ఉంది. ఇది 33.8614 టీఎంసీలకు సమానం.

### గణాంక అధికారుల సంక్షేమ సంఘం ఎన్నిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న గణాంక అధికారులు సంక్షేమ సంఘ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని ఏపీ ఎన్‌జీఓ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పి.వీరబాబు(విశాఖపట్నం), కార్యదర్శిగా వి.వి.వి.ప్రసాద్ (కమిషనర్ కార్యాలయం-మంగళగిరి), కోశాధికారిగా రమేష్ బాబు(గుంటూరు), సహాధ్యక్షుడిగా ఎస్.లక్ష్మోజీ (ఎన్టీఆర్ జిల్లా)తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

### దుర్గమ్మ సన్నిధిలో హనుమజ్జయంతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద, ఘాట్‌రోడ్డులోని అభయ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి మూలమంత్ర జపం, హోమం, అభిషేకాలు, తమలపాకులతో పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

### బాడీ బిల్డర్ల జట్టు ఎంపిక

పెనమలూరు: రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డర్ల జట్టు ఎంపిక చేశామని జిల్లా అధ్యక్షుడు బత్తుల మనోహర్, గౌరవాధ్యక్షుడు ఈదా రాజేష్, కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. వారు ఆదివారం కానూరులో వివరాలు తెలుపుతూ ఈ నెల 21వ తేదీన నెల్లూరు జిల్లా కావలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్టీల్ మేన్ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు ఉమ్మడి జట్టు ఎంపిక చేశామన్నారు. 60 కిలోల విభాగంలో ఎం.రాము, 65 కిలోల విభాగంలో వై.శ్రీకాంత్, ఎం.నారాయణ, ఆర్.నారాయణ రావు, ఎల్.నాగదుర్గారావు, 70 కిలోల విభాగంలో కె.ఉదయ్‌కిరణ్, సీహెచ్ గోపీచంద్, కె.కొండలును ఎంపిక చేశామన్నారు. 75 కిలోల విభాగంలో వి.అఖిలేష్, 80 కిలోల విభాగంలో ప్రసన్న, 85 కిలోల విభాగంలో పి.గోపి, జి.సతీష్‌కుమార్, మాస్టర్స్ విభాగంలో ఎండి.మహబూబ్‌బాషాను ఎంపిక చేశామని తెలిపారు. జట్టుకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. టీమ్‌కోచ్‌గా మణిప్రకాష్, మేనేజర్‌గా వీర వెంకటేలు ఉంటారని తెలిపారు.

## సన్‌డే సెగలు



నిర్మానుష్యంగా గుంటూరు హిందూ కళాశాల సెంటర్

గత ఐదు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉగ్రభానుడి ధాటికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీలు మేర నమోదవుతుండగా.. రాత్రి ఉష్ణోగ్రతలు 25 నుంచి 29 డిగ్రీల మేర రికార్డవుతున్నాయి. పల్నాడు జిల్లా రెంటచింతలలో ఆదివారం అత్యధికంగా 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, గుంటూరు నగరంలో 45 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదయింది.

–కొరిటెపాడు(గుంటూరు)/రెంటచింతల

## జై భజరంగబలి



గుంటూరు కొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ



పొన్నూరులో ప్రత్యేక పూజలు

ధర్మాచరణకు, స్వామి భక్తికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ప్రభాదివ్యకారుడు, వాయుపుత్రుడు హనుమజ్జయంతి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. హనుమాన్ ఆలయాల్లో భక్తులు ఆంజనేయుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- ఈనెల 19వ తేదీ వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు
- ఈనెల 22, 23వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు
- ఉమ్మడి గుంటూరుజిల్లాలో 18 పరీక్ష కేంద్రాలు
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్ టెస్టు నిర్వహణ
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- పరీక్ష సమయానికి రెండు గంటల ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచన



ఆన్‌లైన్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీ సెట్–2023) సోమవారం నుంచి జరగనుంది. ఏపీ ఈఏపీ సెట్ (పాత ఎంసెట్)లో భాగంగా సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్టులను నిర్వహించనుంది. ఇందు కోసం ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో గుంటూరు జిల్లాలో 14, పల్నాడులో మూడు, బాపట్లలో ఒకటి చొప్పున ఉన్నాయి.

- ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో పరీక్షలు జరగనున్నాయి.
- ఏపీ ఈఏపీ సెట్ హాల్ టిక్కెట్, ఐడీ కార్డు, పెన్సిల్ మినహా ఇతర ఎటువంటి వస్తువులను విద్యార్థులు తమ వెంట తీసుకురాకూడదు. సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు.
- ఏపీ ఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే రాష్ట్ర ఉన్నత విద్యామండలి విద్యార్థులకు ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్ ద్వారా నియమ, నిబంధనలను స్పష్టం చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించే ముందు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ ఒక్కో విడత ఆన్‌లైన్ పరీక్షకు 100 నుంచి 200 మంది విద్యార్థుల వరకు కేటాయించారు.
- ఏపీ ఈఏపీ సెట్‌లో భాగంగా ఈనెల 22,23 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి.

**రెండు గంటల ముందుగా చేరుకోవాలి..**

ఏపీ ఈఏపీ సెట్‌కు హాజరు కానున్న విద్యార్థులు పరీక్షా సమయానికి రెండు గంటలు ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని పరీక్ష కేంద్రాల నిర్వాహకులు సూచించారు. ఉదయం పరీక్షకు 7 గంటలు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు ఒంటి గంట కల్లా కేంద్రాల వద్దకు చేరుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమ, నిబంధనల్లో పొందుపర్చింది. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 3 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. నిర్దేశిత సమయానికి ఖచ్చితంగా పరీక్ష ప్రారంభమవుతుంది. ముందుగా వచ్చే విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన మార్గదర్శకాలను ఇన్విజిలేటర్లు వివరిస్తారు.

# సీఎం జగన్‌తోనే చేనేత రంగం అభివృద్ధి

ఎమ్మెల్సీలు పోతుల సునీత, మురుగుడు



చేనేతల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు

చీరాల: సంక్షోభంలో ఉన్న చేనేత అభివృద్ధితోపాటుగా చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకురావడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీలు పోతుల సునీత, మురుగుడు హనుమంతరావు అన్నారు. మండలంలోని ఈపురుపాలెంలో జాతీయ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం బాపట్ల జిల్లా చేనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు పోతుల సునీత, మురుగుడు హనుమంతరావు, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ బి.విజయలక్ష్మి, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బి.రాధాకృష్ణయ్య హాజరయ్యారు. ఎమ్మెల్సీలు మాట్లాడుతూ చేనేత రంగాన్ని గత ప్రభుత్వాలు విస్మరించి కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షోభంలో ఉన్న చేనేతరంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.24 వేలు వైఎస్సార్ నేతన్న నేస్తం అందించడంతో పాటుగా చేనేత ఉత్పత్తుల అమ్మకాలకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. చేనేతలకు సొంత మగ్గం ద్వారా వస్త్రాలు నేసే విధంగా కృషి చేశారన్నారు. బడ్జెట్‌లో చేనేతలకు కేటాయింపులు పెంచి చేనేత వృత్తికి పూర్వ వైభవం తీసుకొచ్చారని చెప్పారు. చేనేతలకు రాజకీయ ప్రాధాన్యత నిచ్చి ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితర పదవుల్లో అధికంగా ప్రాధాన్యత కల్పించారన్నారు. చేనేతలకు ఉన్న సమస్యలు, హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డి, సీహెచ్ వెంకటరమణ, ఉపాధ్యక్షుడు ఎ.నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుల సురేష్, చేనేత నాయకులు గోలి వెంకటరావు, కె.వెంకటేశ్వర్లు, ఎం.గిరిధర్ పాల్గొన్నారు.

# సైబర్ వలవిల

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో విద్యావంతులు సైతం..
- తాజాగా నరసరావుపేటకు చెందిన ఓ బ్యాంకు మేనేజర్ బోల్తా
- సుమారు రూ.14 లక్షలకుపైగా పోగొట్టుకున్న వైనం
- తన ప్రమేయం లేకుండానే రూ.లక్ష పోగొట్టుకున్న రియల్టర్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ**

అక్షరం ముక్కరాని నిరక్షరాస్యులే కాదు... ఉన్నత చదువులు చదివిన వారు సైతం ఆశల వలలో చిక్కి సైబర్ ఉచ్చులో బిగుసుకుంటున్నారు. హాయ్ అంటూ ఆప్యాయంగా పలకరించి మాటలతో మంత్రమేస్తుంటే.. చదువుకున్న జ్ఞానాన్ని మూలనపెట్టి లక్షణంగా లక్షలు సమర్పించుకుంటున్నారు. ఒక్క క్లిక్‌తో వేల రూపాయలు వచ్చి ఒడిలో పడతాయని మాయ చేస్తుంటే... విద్య నేర్పిన ఆలోచనా శక్తిని మరిచి లింకులోకి వెళ్లి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఇలా అధిక శాతం మంది ఉన్నత విద్యావంతులు సైబర్ వలలో చిక్కి లక్షలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. కాసుల ఆశలో పడి కాస్తంత వివేకాన్ని మరిచిపోతున్నారు.



నరసరావుపేట టౌన్: సాంకేతిక నూతన పరవళ్లు తొక్కుతున్నందుకు ఆనంద పడేంతలోపే.. అదే సాంకేతికతను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. అయితే ఈ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో అధిక శాతం మంది ఉన్నత విద్యావంతులు చిక్కుకోవడం కలవరపెడుతోంది. తాజాగా నరసరావుపేట పట్టణానికి చెందిన ఓ బ్యాంకు మేనేజర్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మోసపోవడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. నరసరావుపేటకు చెందిన ఓ బ్యాంకు మేనేజర్ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం ఆన్‌లైన్ లింక్ వచ్చింది. అందులోని వీడియో చూస్తే చాలు..నగదు అకౌంట్‌లో జమ చేస్తామని లింకు కింద రాసి ఉంది. అది గమనించిన బ్యాంకు మేనేజర్ లింక్ క్లిక్ చేశారు. వీడియో ప్లే అవ్వడంతో మొత్తం చూశాడు. వెంటనే తన అకౌంట్లోకి కొంత నగదు జమ అయ్యింది. నగదు జమైన వెంటనే మరి కొన్ని వీడియోలు లింకు పంపించారు. వీటిని వీక్షించినందుకూ నగదు జమ చేశారు. అనంతరం టెలిగ్రామ్ లోకి ఆహ్వానించి మరి కొన్ని టాస్క్‌లు ఇచ్చారు. జమ అయిన నగదు బ్యాంక్‌లో క్రెడిట్ అవ్వాలంటే కొంత మొత్తం నగదు వారి అకౌంట్‌లో వేయాలని సైబర్ నేరగాళ్లు తెలిపారు. అక్కడ నుంచి సదరు బ్యాంకు మేనేజర్‌తో విడతల వారీగా నగదు వారి అకౌంట్లలోకి జమ చేయించుకున్నారు. ఇలా సుమారు రూ.14 లక్షల వరకు జమ చేయించారు. అనంతరం మరో రూ.8 లక్షల అకౌంట్లోకి పంపిస్తే మొత్తం ఇస్తామని తెలిపారు. ఇక తన వద్ద డబ్బులు లేవని, రావాల్సిన నగదు జమ చేయమని బ్యాంకు మేనేజర్ కోరగా ఎదుట నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయాయనని గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదును స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని తెలపగా నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

**వేలిముద్రల ఆధారంగా నగదు మాయం...**

- గుంటూరు నగరానికి చెందిన ఓ డాక్టర్ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని ఇటీవల సుమారు రూ.35 లక్షల వరకు మోసపోయాడు.
- నరసరావుపేట టూటౌన్ పరిధిలోని కుమ్మరబజార్‌కు చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ రూ.8 లక్షలు కోల్పోయాడు.
- నరసరావుపేట పట్టణానికి చెందిన ఓ ప్రముఖ రియల్టర్ ఖాతాలో రూ.10 వేల చొప్పున విడతల వారీగా రూ.లక్ష నగదు తన ప్రమేయం లేకుండానే అకౌంట్ నుంచి మాయమైంది. బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీయగా వేలిముద్ర ఆధారంగా సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసినట్టు తెలుసుకున్నాడు. అసలు సంబంధమే లేకుండా అత్యంత చాకచక్యంగా సైబర్ నేరగాళ్లు నగదును తస్కరించడమం కలవరపాటుకు గురిచేస్తోంది.

**అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వం...**

రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ, సచివాలయ సిబ్బంది ద్వారా సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువస్తోంది. సచివాలయాల్లోని మహిళా పోలీసుల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఓటీపీ, పిన్ నంబర్, బ్యాంకు లావాదేవీలు, అపరిచితుల కాల్స్ వంటి వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరిస్తోంది. వీరితోపాటు వలంటీర్ల సేవలనూ సైబర్ నేరాలు అరికట్టేందుకు తీసుకుంటుంది. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయమని చెబుతున్నారు. అలా చేయడం ద్వారా నగదు తస్కరించబడ్డ ఖాతాలను సీజ్ చేస్తారు. ఇది కొంతవరకు సత్ఫలితాలనిస్తోంది. సైబర్ మోసగాళ్ల చేతిలో చిక్కుకుంటున్న వారిలో నిరక్షరాసులు తక్కువగా ఉండడమే గమనార్హం. సైబర్ నేరగాళ్లలో ఊబిలో కూరుకుని అధిక శాతం నగదు మోసపోతున్న వారిలో ఉన్నత విద్యావంతులు ఎక్కువగా ఉంటున్నారు.

### అప్రమత్తంగా ఉండాలి..



సైబర్ నేరగాళ్లు ఊహకు అందని విధంగా ఎప్పటికప్పుడు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. సాంకేతికతను ఆసరా చేసుకొని ఖాతాల్లో నగదు తస్కరిస్తున్నారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ఇప్పటికే విద్యాసంస్థలలో సైబర్ నేరాలపై పూర్తిస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ చర్యలతో 2021తో పోల్చితే 2022 సైబర్ నేరాలు జిల్లాలో 72 శాతం తగ్గుముఖం పట్టాయి.

– వై.రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

## యజ్ఞం.. తన్మయత్వం

విజయవాడ కల్చరల్: శ్రీలక్ష్మీ మహాయజ్ఞం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మూడో రోజు ఆదివారం శాస్త్రోక్తంగా సాగింది. చతురాగమ యాగశాలల్లో 108 కుండాల్లో హోమం, అర్చనలు చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం, ప్రజల కల్యాణ, సౌభాగ్యాల కోసం చేస్తున్న యాగాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రజలందరికీ ఆయురారోగ్య, ఐశ్వర్య ప్రాప్తికోసం చేస్తున్న మహాయజ్ఞాన్ని భక్తులు కనులారా చూసి తరించారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయశాఖ కమిషనర్ రాము సత్యనారాయణ మూడో రోజు యాగానికి సంబంధించిన విశేషాలను వివరించారు.

**ఆకట్టుకున్న నృత్య రూపకాలు..**

కల్యాణవేదికపై ముందుగా ఏలూరు కేవీ సత్యనారాయణ బృందం ప్రదర్శించిన ఆముక్తమాల్యద గోదా రంగనాథుల కల్యాణ నృత్యరూపకం ఆకట్టుకుంది.

**ధార్మిక ప్రవచనాలు..**

సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30గంటల వరకు రాష్ట్ర అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి ధార్మిక ప్రవచనం చేశారు.

**కనుల విందుగా కల్యాణోత్సవం..**

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు కల్యాణాన్ని దర్శించడంతోపాటు అన్నవరం నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన ప్రసాదాన్ని స్వీకరించారు.

# మత్స్యకారులకు కొండంత అండ

- మత్స్యకార భరోసా పథకం ద్వారా 1.40లక్షల మందికి లబ్ధి
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



నిజాంపట్నంలో సీఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె: వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని నిజాంపట్నంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను జయప్రదమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వేట నిషేధ కాలంలో ఉపాధిని కోల్పోతున్న మత్స్యకార కుటుంబాలకు కొండంత భరోసా నివ్వాలన్న ఉద్దేశ్యంతో వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరుతో అర్హులైన మత్స్యకార కుటుంబాలకు ప్రతి ఏటా రూ.10వేల నగదును అందిస్తున్నారన్నారు. ఎప్పటి నుంచో ఉన్న పథకం అయినప్పటికీ గత ప్రభుత్వాలు మొక్కుబడిగా మత్స్యకార కుటుంబాలకు అంతంత మాత్రంగా భృతిని అందించేవారని గుర్తు చేశారు. మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులు తెలిసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయాన్ని పెంచి రూ.10వేలు వారి ఖాతాలలో జమ చేస్తున్నారన్నారు. 5వ విడత మత్స్యకార భరోసా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16వతేదీ మంగళవారం నిజాంపట్నంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన 1.40 లక్షల మందికి బటన్ నొక్కి సహాయాన్ని అందజేస్తారన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని అర్హత కలిగిన 10వేల మంది మత్స్యకార కుటుంబాలతో పాటు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. తొలుత పట్టణంలోని కౌన్సిలర్‌లు, పార్టీ ముఖ్యనాయకులు, గృహసారథులతో కార్యక్రమ విజయవంతానికై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు మోపిదేవి రాజీవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**సభ ఏర్పాట్ల పరిశీలన...**

నిజాంపట్నం: ఈనెల 16వ తేదీన నిజాంపట్నంలో జరగనున్న వైఎస్సార్ మత్స్యకార భరోసా సభ ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. సభ ఏర్పాట్లను ఆదివారం ఎంపీ మోపిదేవి పర్యవేక్షించారు. మోపిదేవి మాట్లాడుతూ నిజాంపట్నం–రేపల్లె ప్రధాని రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి పాల్గొనే సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను దాదాపుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. సభకు వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతులను సమకూర్చుతున్నామని తెలిపారు. నిజాంపట్నం–బాపట్ల రోడ్డులో హెలిప్యాడ్ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ప్రధాన రహదారిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బందోబస్తుతో పాటు అక్కడక్కడ బ్యారికేడ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలుశాఖ అధికారులతో ఎంపీ మోపిదేవి మాట్లాడి జరుగుతున్న పనులపై చర్చించారు.

**పనుల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం..**

సభకు సంబంధించిన ఏర్పాట్లలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఏర్పా ట్లు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. శాఖల వారీగా అధికారులకు పనులను కేటాయించడంతో అధికార యంత్రాంగం అప్పగించిన పనులను పూర్తిచేసే పనిలో ఉన్నారు.

# పచ్చిరొట్ట సాగుతో భూసారం


సాగు చేసిన పచ్చి రొట్ట ఎరువుల పంట (ఫైల్)

కొరిటిపాడు(గుంటూరు): పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతమవుతోంది. పోషకాలు అంది ఆరోగ్యంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తోంది. గుంటూరు జిల్లాలోని 18 మండలాలకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసింది. ఇప్పటికే జిల్లాకు 255 క్వింటాళ్ల జీలుగలు, 425 క్వింటాళ్ల జనుములు, 1,020 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు సరఫరా అయ్యాయి. వీటిని 50 శాతం సబ్సిడీపై అధికారులు అందజేయనున్నారు. క్వింటా జీలుగ విత్తనాల ధర రూ.7,900, జనుము విత్తనాల ధర రూ.8,400, పిల్లిపెసర విత్తనాల ధర రూ.9,700గా ఉంది. కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**సాగు ఇలా...**

జిల్లాలోని రైతులు రొట్ట పైర్లయిన జీలుగలు, జనుము, పిల్లిపెసర, అలసంద వంటి పంటలను సాగు చేయడానికి రైతులు ఇష్ట పడుతున్నారు. సేద్యం చేసిన పొలంలో జీలుగలు, పిల్లిపెసర విత్తనాలైతే ఎకరానికి 10 నుంచి 12 కిలోలు, జనుము విత్తనాలు 16 కిలోల వరకు చల్లి నీటిని పెట్టాల్సి ఉంటుంది. తరువాత అవసరాన్ని బట్టి నీటిని కట్టాలి. ఇవి వర్షాభావ పరిస్థితుల్లోనూ తట్టుకుని పెరుగుతాయి. జీలుగ, జనుము, పిల్లిపెసర సాగు వలన హెక్టారుకు సుమారు 18 నుంచి 21 టన్నుల గ్రాసం దిగుబడి వస్తుంది. దీన్ని పశువుల మేతగా కూడా వాడుతున్నారు. ఎరువు కోసమైతే పచ్చి రొట్ట పైర్లను పూత సమయంలో నేలలో కలియ దున్నాలి. పైరు వయసు 50 నుంచి 60 రోజుల లోపు కలియ దున్ని ఒకటి, రెండు వారాల తరువాత నాట్లు వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందడానికి అవకాశం ఉంటుంది.

**నత్రజని వాడకం తగ్గించుకోవచ్చు...**

పచ్చిరొట్ట సాగుతో ప్రస్తుతం పొలాలకు రసాయన ఎరువుల రూపంలో అందిస్తున్న నత్రజని(యూరియా) వాడకాన్ని దాదాపు 20 నుంచి 30 శాతం వరకు తగ్గించుకోచ్చు. దీంతోబాటు నేలలో నీరు, రసాయన ఎరువులు భూమి కింది పొరలకు జారి పోకుండా అడ్డుకట్ట పడుతుంది. నేలలో చౌడును తగ్గించడానికి సహాయకారిగా మారుతుంది.

## సబ్సిడీపై విత్తనాల పంపిణీ



నిస్సారంగా మారుతున్న నేల ఆరోగ్య రక్షణకు సహాయపడే పచ్చి రొట్ట ఎరువుల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోంది. దీనికోసం రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పేర్లు నమోదు కార్యక్రమం జరుగుతోంది. అది పూర్తి కాగానే విత్తనాలు అందజేస్తాం.

– నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి.

# శోభాయమానంగా హనుమాన్ శోభాయాత్ర


పట్టణంలో సాగిన హనుమాన్ శోభాయాత్ర, పాల్గొన్న ఎమ్మెల్యే కరణం


శోభాయాత్రలో చిన్నారుల నృత్య ప్రదర్శన

- సింధూరవర్ణంగా మారిన రోడ్లు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కరణం

చీరాల అర్బన్: హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం చీరాలలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం బోస్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవస్థానం నుంచి పట్టణంలోని హనుమాన్ నామస్మరణలతో శోభాయాత్ర ముంతావారిసెంటర్, దర్బార్‌రోడ్డు మీదగా గడియార స్తంభం వరకు సాగింది. శోభాయాత్ర సాగే రోడ్లన్ని సింధూర వర్ణ జెండాలతో నిండిపోయింది. ప్రస్తుతం శోభాయాత్రను నాలుగోసారి పట్టణంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. శోభాయాత్రలో భారీ సైజు ఆంజనేయస్వామి విగ్రహాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కేరళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాల కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణలతో శోభాయాత్ర శోభయమానంగా సాగింది. కార్యక్రమాలను దేవదాయశాఖ మేనేజర్ జీవీఎల్ కుమార్, హనుమాన్ భక్తబృందం ప్రతినిధులు, పలువురు ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఒన్‌టౌన్ సీఐ వీ.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# విద్యాకానుకను జాగ్రత్తగా పంపిణీ చేయాలి

**సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాసరావు**

జే.పంగులూరు: జగనన్న విద్యా కానుక సామగ్రిలో ఏవైనా తక్కువగా, ఎక్కువగా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి సరి చేసుకోవాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పంగులూరు హైస్కూల్లో ఉన్న జగనన్న విద్యా కానుక మండల లెవెల్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆయన పరిశీలనలో 9వ నెంబరు గల బూట్లు రాలేదన్న విషయం తెలియటంతో అధికారులను నిలదీశారు. ఈ విషయమై ఆదివారం రాత్రి శ్రీనివాసరావు పరిశీలించేందుకు పంగులూరు హైస్కూల్‌కు వచ్చారు. 9వ నెంబర్ బూట్లు ఎందుకు రాలేదో పరిశీలించారు. సిబ్బంది మొత్తం సామగ్రిని పరిశీలించి, ఏవైనా ఎక్కువగా వస్తే వాటిని తిరిగి పంపాలన్నారు. తక్కువగా ఉంటే తెలియజేసి వాటిని తెప్పించుకోవాలని కోరారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా జగనన్న విద్యా కానుకను అమలుపరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మున్నయ్య, సీఎంఓ రజిని, ఎంఈవో నాగభూషణం, పంగులూరు హైస్కూల్ హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు.

# ఇగ్నో దూర విద్యాకోర్సులు



మాట్లాడుతున్న ఇగ్నో సమన్వయకర్త భాను మురళీధర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అందిస్తున్న దూరవిద్య కోర్సులతో ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు పుష్కల అవకాశాలు ఉన్నాయని ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త ఎ.భాను మురళీధర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో ఆదివారం జనవరి 2023 సెషన్ ప్రారంభ సందర్భంగా కొత్తగా ఆయా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. భాను మురళీధర్ మాట్లాడుతూ సర్టిఫికెట్, డిప్లమో, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులతో ఇగ్నో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ కౌన్సిలర్లు కేఎల్ వర్సిటీ ఆచార్య ఎంఎస్ సత్యనారాయణ, కళాశాల పీజీ ప్రొఫెసర్ బీవీఎంకే శాస్త్రి విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి. దేవేంద్రగుప్తా, వై.మార్కండేయులు పాల్గొన్నారు.

# శింగరకొండలో వైభవంగా హనుమజ్జయంతి

**సర్వాలంకృతుడుగా వెలిగిపోయిన ప్రసన్నాంజనేయ స్వామి**


సర్వాలంకృతుడైన ఆంజనేయస్వామి


వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

అద్దంకి: జిల్లాలో పుణ్య క్షేత్రమైన శింగరకొండలో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ప్రసన్నాంజనేయస్వామి వారి మూల విరాట్టును అర్చకులు సర్వాంగాలతో అలంకరించారు. ఆ దివ్య రూపాన్ని సందర్శించి భక్తులు భక్తిపారశ్యంలో 'జై వీరాంజనేయ..' అంటూ ఆలయ పరిసరాలను హోరెత్తించారు. స్వామివారికి అత్యంత ఇష్టమైన బంగారు తమలపాకు (బంగారులతో అర్చన నిర్వహించారు. మూడో రోజులో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, వేద స్వస్తి, గణపతిపూజ, లక్ష తమలపాకులతో పూజ, సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి ఉత్సవ మూర్తులకు అభిషేకం, పూజ, నివేదన, వేదాశీర్వచనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తరువాత యాగశాలలో నిత్య అనుష్ఠానాలు, మన్యుసూక్త హవనం, పూర్ణాహుతి, ద్రవ్యపూజ, మహాపూర్ణాహుతి, యాగశాల ప్రదక్షిణ, వేదాశీర్వచనం, సహస్ర దీపాలంకరణ సేవ, మామిడిపండ్లతో పూజ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఏసీ టీ సుభద్ర, సిబ్బంది పర్యవేక్షించారు.

**వెండి అర్ధ కిరీటం బహూకరణ..**

ప్రసన్నాంజనేయ స్వామి వారికి రొంపిచర్ల మండలం పరగడిచర్ల గ్రామానికి చెందిన గుడిపూడి ఆంజనేయులు దంపతులు స్వామివారికి 500 గ్రాముల వెండి అర్ధ కిరీటాన్ని, 200 గ్రాముల వెండి కుందులు రెండింటిని బహూకరించారు. వాటిని దేవస్థాన ఏసీ సుభద్రకు అంజేశారు.

# రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చీరాలరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చినగంజాం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. చినగంజాం రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 42 నుంచి 45 ఉంటుందని, మృతదేహంపై బ్లూ జీన్స్ ప్యాంట్, లైట్ బ్లూ కలర్ షర్ట్ ఉన్నట్లు చెప్పారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శతాధిక వృద్ధురాలు మృతి


శ్యామల వీరమ్మ (ఫైల్)

పిట్టలవానిపాలెం: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన ఘటన పిట్టలవానిపాలెం మండలంలో జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కోమలి గ్రామానికి చెందిన శ్యామల వీరమ్మ (110) ఆదివారం వడదెబ్బకు మృతిచెందింది. ఆమె గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బసివిరెడ్డి భార్య. ఇప్పటి వరకు ఆమె పనులు స్వయంగా చేసుకుంటూ ఆరోగ్యంగానే జీవించింది. నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. వీరమ్మ మృతిపట్ల గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



## జూన్ 7న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

**రామాలయాన్ని సందర్శించిన కూర్మనాథస్వామి**


యాగశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కూర్మానాథస్వామి తదితరులు



నాదెండ్ల: గణపవరంలో రూ.2.5 కోట్లతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయాన్ని ఆదివారం త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి శిష్యులు కూర్మనాథస్వామి సందర్శించారు. జూన్ ఏడో తేదీన చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, జీవధ్వజస్తంభం, కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు కూర్మానాథస్వామితో పాటూ టీటీడీ వేద పాఠశాల అధ్యాపకులు శ్రీనివాస దీక్షితులు, భారతీయ ధార్మిక విజ్ఞాన పరిషత్ కన్వీనర్ బొల్లేపల్లి సత్యనారాయణ, ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్యదర్శి పేర్ని వీరనారాయణ, కేతినేని శ్రీహరిరావు ఆలయాన్ని సందర్శించారు. యాగశాలను సందర్శించి జూన్ 3 నుంచి 6 వరకు నిర్వహించాల్సిన విగ్రహ పూజలు, హోమాలు తదితర అంశాలపై చర్చించారు. వేద పండితుల బృందానికి వసతి ఏర్పాట్లుపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కూర్మానాథస్వామి చేతుల మీదుగా కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు


గజల్ పాడుతున్న శ్రీనివాస్

చీరాల అర్బన్: మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో చీరాల కళాంజలి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం రాత్రి హేలాపురి కల్చరల్ అసోసియేషన్, ఏలూరి వారి ఆధ్వర్యంలో ''మనసున మనసై' నాటికను ప్రదర్శించారు. అనంతరం గజల్ శ్రీనివాస్ తెలుగు గజల్ విభావరిని నిర్వహించారు. గజల్ శ్రీనివాస్ గజల్ విభావరి అందరిని ఆకట్టుకుంది. నాటక ప్రదర్శనలకు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. ప్రదర్శిస్తున్న నాటికలు ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి దరియా సాహెబ్, పూర్ణ సత్యం, వడలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒంగోలు అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు గాయాలు



తీవ్రగాయాలైన దుర్గాభవాని, కుమార్తె కళ్యాణి

గుంటూరు రూరల్: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఆదివారం నల్లపాడు పోలీస్ స్టేషన పరిధిలో జరిగింది. నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం ఒంగోలు అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా పనిచేస్తున్న దుర్గాభవాని తన కుమార్తె కళ్యాణిని నగర శివారుల్లోని ఒక కళాశాలలో విద్యాభ్యాసం నిమిత్తం చేర్పించేందుకు ఆటోలో వచ్చారు. కళాశాలలో మాట్లాడుకుని అనంతరం తిరిగి ఆటోలో వెళ్తుండగా ఈ క్రమంలో ఆర్టీవో కార్యాలయం సమీపంలో అతివేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొనటంతో దుర్గాభవానికి ఆమె కుమారుడికి, కుమార్తె కళ్యాణి ఆటో డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించటంతో వారిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కర్రసాములో క్రీడాకారుల ప్రతిభ

పెదకాకాని: కర్రసాము పోటీల్లో గుంటూరు జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. విశాఖపట్నంలోని ఆంధ్రాయూని వర్సిటీలో ఈనెల 13, 14 తేదీలలో రాష్ట్రస్థాయి వాకో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగానే జరిగిన మ్యూజికల్ ఫార్మ్(కర్రసాము) పోటీలకు గుంటూరు జిల్లా నుంచి 9 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కర్రసాము మాస్టర్ కరీదు సాంబయ్య నేతృత్వంలో పాల్గొన్న 9 మంది క్రీడాకారులు 13 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, 5 రజత పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో కొర్రపాటి చంద్రశేఖర్ మూడు గోల్డ్ మెడల్స్, ఖరీదు సాంబయ్య ఒక గోల్డ్, 2 సిల్వర్, ప్రత్తి పవన్‌కుమార్ ఒక గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్, ఎం.తరంగిణి సింగు ఒక గోల్డ్, రెండు సిల్వర్ పతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో కొండా దేవప్రణతి రెండు గోల్డ్, ఒక సిల్వర్, వేల్పుల సాయి హేమంత్ ఒక గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్, నూతక్కి రాహుల్ ఒక బ్రాంజ్ సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల్లో సీనియర్లు జూలై 1వ నుండి 5వ తేది వరకూ పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. జూనియర్ విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఆగష్టు 23వ తేదీ నుండి 27వ తేదీ వరకూ జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే పోటీలలో పాల్గొంటారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను, కోచ్ ఖరీదు సాంబయ్యను వాకో ఇండియా కోచింగ్ కమిటీ చైర్మన్ సి.సురేష్‌బాబు, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ జి.ఆనంద్‌బాలు, సెక్రటరీ కె నరేంద్రచారి అభినందించారు.

# సత్తా చాటిన పల్నాడు జిల్లా ఎడ్లు


ఎడ్లపోటీలను ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

కంభం: మండలంలోని రావిపాడు గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో పల్నాడు జిల్లా ఎడ్లు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ ఎడ్ల పోటీలను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు కుమారుడు కృష్ణచైతన్య చేతుల మీదుగా ప్రారంభించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం దప్పిలి అంజిరెడ్డి ఎడ్లు 1498 అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ.60 వేలను, నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం మేకల వెంకటరాముడు ఎడ్లు 1257 దూరం లాగి రెండవ బహుమతి రూ.50 వేలు, అర్ధవీడు మండల వల్లెల క్రిష్ణారెడ్డి ఎడ్లు 778 అడుగులు లాగి మూడో బహుమతి రూ.40 వేలు, బేస్తవారిపేట మండలం నాగశివశంకర్ ఎడ్లు 757 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.30 వేలు, బేస్తవారిపేట మండలం సాయిసాత్విక్ ఎడ్లు 224 అడుగులు దూరం లాగి ఐదో బహుమతి రూ.20 వేలు దక్కించుకున్నాయి. ఈ ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలి

**ఈజీఎస్ డైరెక్టర్ చిన్నతాతయ్య**


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఈజీఎస్ డైరక్టర్ చిన్నతాతయ్య

వేటపాలెం: ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనకబడిన కుటుంబాలు గ్రామీణ ఉపాధి హామీ పథక పనులను సద్వినియోగించుకొని జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) డైరెక్టర్ పీ చిన్నతాతయ్య సూచించారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. అక్కాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పంట కాలవల పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా పెంచుతున్న నర్సరీ, రామన్నపేట పంచాయతీలో డ్వామా నర్సరీ కింద సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. చిన్నతాతయ్య మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు ఉదయాన్నే పనులకు హాజరై పూర్తి చేయాలని సూచించారు. ఉదయం ఎన్ఆర్‌జీఎస్ పథకం పనులు చేసుకొని సాయంత్రం నుంచి ఇతర పనులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఏడాది జిల్లాకు ఉపాధి పనుల కింద టార్గెట్ కింద రూ.73 లక్షల పనిదినాలు నిర్ధారించారని తెలిపారు. ఇప్పటివరకు రూ.14 లక్షల పనిదినాలు పూర్తిచేశారని, 70 వేల మంది కూలీలు పనులు చేశారని తెలిపారు. పనులు చేసే ప్రాంతాలకు కూలీలకు సంబంధించిన చిన్నపిల్లలను తీసుకొని రావద్దని సూచించారు. వీరి వెంట డ్వామా పీడీ వై శంకర్‌నాయక్, ఏపీడీ ఎస్ రాజేష్, ఎంపీడీవో ఎంపీఎస్ శర్మ, ఏపీవో సుధారాణి పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న నాటికలు


సాహితీ సూక్తం నాటికలో దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న 23వ ఆహ్వాన నాటిక పోటీలు ముగిశాయి. చివరి రోజైన ఆదివారం రెండు నాటికలను ప్రదర్శించారు. మోసగించటం ఫ్యాషన్‌గా మారిపోయిన నేటి సమాజంలో మోసపోయిన వాళ్ల ఆత్మహత్యలు చేసుకున్నా..., మోసగించిన వ్యక్తిని హత్య చేసినా జరిగిన ఘటనల్లో నిజమైన శిక్ష అనుభవించేది ఎవరు? ఈ ప్రశ్నకు సమాధానం వెతుకుతున్న ఓవ్యక్తి సాహిత్యం సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తుంది?, సాహిత్యానికి సమాజానికి ఉన్న సంబంధం, ఆత్మహత్యలు, హత్యలు వంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చెప్పే ఇతివృత్తంతో సికింద్రాబాద్ కె.జె.ఆర్.కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన సాహితీ సూక్తం ప్రేక్షకులను ఆలోచింప చేసింది. తెనాలికి చెందిన కళల కాణాచి కళాకారులు ప్రదర్శించిన అంధ స్వరం నాటికలో నేటి సమాజంలో మనిషి మానవత్వాన్ని, నైతిక విలువలను మరచి మృగంగా మారుతున్న వైనాన్ని కనులకు కట్టినట్టు ప్రదర్శించారు. సమాజంలో పవిత్రమైన స్త్రీమూర్తికి, మానవ మృగాలకు మధ్య జరిగే సంఘర్షణల నేపథ్యంగా సాగిన అంధస్వరం ఆకట్టుకుంది. ఈసందర్భంగా నటుడు, దర్శక రచయిత ఎం.సంజీవిని రంగస్థలి ప్రతిభాపురస్కారంతో సత్కరించారు. రంగస్థలి అధ్యక్ష, కార్యదర్శులు షేక్.బాజీ, నల్లపాటి బోస్, కోశాధికారి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఏ.ఏ.మధుకుమార్, సింహాద్రి వేణు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఆర్.ప్రసన్నకుమార్ పర్యవేక్షించారు.

## క్లుప్తంగా

### బండ్లమ్మకు వైభవంగా పూజలు



**చందోలు(పిట్టలవానిపాలెం):** చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో వైశాఖ మాసం నాలుగవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 19న అమావాస్య సందర్భంగా 51వ అమావాస్య హోమం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. హోమంలో పాల్గొనే ఉభయ దాతలు 18వ తేదీ లోపు తమ పేరు, వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

### ఘనంగా పెద్దింటమ్మ తిరునాళ్ల



**నల్లమోతువారిపాలెం(కర్లపాలెం):** భక్తుల కొంగుబంగారం, గ్రామ దేవత పెద్దింటమ్మ తిరునాళ్ల ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఐదు రోజుల నుంచి పెద్దింటమ్మ కొలుపులు జరుగుతున్నాయి. అమ్మవారి ఘటానికి మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం మహిళలు, భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. రాత్రికి తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి ఆలయం వద్ద సుమారు 80 నుంచి 100 అడుగుల విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి, కానుకలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**చుండూరు(వేమూరు):** ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని కేవీఆర్ ట్రస్ట్ ద్వారా అదుకోవడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు. చుండూరు మండలంలోని చిన గాదెవర్రు గ్రామంలో కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు గాదెలవర్తి రాజు అనే వ్యక్తి మరణించాడు. ఆదివారం అతని కుటుంబ సభ్యులకు రూ.5 వేలు నగదు అందజేశారు. గ్రామ సచివాలయ కన్వీనర్ సంజీవ్, పార్టీ నాయకులు అకేశ్వరరావు, సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**బాధితుడికి ఆర్థిక సాయం**

గ్రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కైతేపల్లి షాలేం రాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోపర్తి జ్యోతి ప్రశాంత్‌కి ఆదివారం పరామర్శించి, కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రేస్ ఫౌండేషన్ ప్రచార కమిటీ కన్వీనర్ యన్నం సురేష్, సభ్యులు యల్లమాటి దాసు, క్రాప నాని, పచ్చిగళ్ల అనిల్ పాల్గొన్నారు.

### సంకీర్తన గురువు వసుంధరకు సత్కారం

**తెనాలి:** అన్నమాచార్య కీర్తనల ప్రచారంలో కొనసాగుతున్న తెనాలికి చెందిన సంకీర్తన గురువు కొండపి వసుంధరను ఆదివారం స్థానిక వైకుంఠపురం దేవస్థానంలో సత్కరించారు. పట్టణానికి చెందిన శ్రీసత్యనారాయణ భజన మండలి ఆధ్వర్యంలో ఈ సత్కారం చేశారు. అన్నమయ్య కీర్తనలను ఉచితంగా నేర్పటమే కాకుండా తమను తిరుమల నాద నీరాజనం మండపం, ఒంటిమిట్ట, తాళ్లపాకలో సంకీర్తన చేయించటం, వైకుంఠపురంలోని బ్రహ్మోత్సవాల్లోనూ అవకాశం ఇచ్చినందుకు శిష్యబృందం తమ గురువును సత్కరించుకుంది. అనితమాధవి, మారా లలితకుమారి, గుబ్బా లక్ష్మీకుమారి, కంభంపాటి లీలారత్నకుమారి, చౌట నాగమల్లేశ్వరి, దేవిలలిత, తాడేపల్లి సూర్యనాగమల్లేశ్వరి పర్యవేక్షించారు. నృత్యగురువు జి.నిర్మల రమేష్, సురాబత్తుల కేశవరావు, పాల్గొన్నారు.

# జయ హనుమాన్

- భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు
- స్వామికి నైవేద్యంగా పండ్లు, అప్పాలు
- పంచామృత అభిషేకాలు, సిందూర అర్చన, తమలపాకుల పూజ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అడవులదీవిలో పూజలు చేస్తున్న డీసీఎంఎస్ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి



ఆంజనేయునికి తమలపాకులతో అలంకరణ

**అడవుల దీవిలో కనుల విందుగా..**

**నిజాంపట్నం:** అడవులదీవిలో డీసీఎంఎస్ చైర్ పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం కనుల విందుగా జరిగాయి. అర్చకులు ఉమా మహేశ్వరరావు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించి, పత్యేక పూజలు చేశారు. భక్త బృందం 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసింది. అన్న సంతర్పణ చేశారు. దిండి పంచాయతీ పరిశావారి పాలెం సముద్ర తీరాన ఆంజనేయస్వామి ఆలయం, నిజాంపట్నం, కూచినపూడి, కొత్తపాలెంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**ప్రసన్నాంజనేయునికి ఫలార్చన..**

**బాపట్ల అర్బన్:** బాపట్ల పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా.. ప్రసన్నాంజనేయ స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించారు. నాగవల్లి సహిత సిందూర సహస్రనామార్చన అత్యంత వైభవంగా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త బద్రి నారాయణ పూజలు చేశారు. అర్చకులు రంగనాథ ఆచార్యులు, కేశవాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

– సువర్చలా సమేత ప్రపత్త్యాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవంలో భాగంగా స్వామికి ప్రాతః కాలంలో ఫలార్చన, సిందూర అర్చన, నాగవల్లీ దళార్చనలు చేశారు. సింహ వాహనంపై నగరోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు విఖనసమూర్తి, అప్పలాచార్యులు, కేశవాచార్యులు, వంశీ, కృష్ణమాచార్యులు శ్రీ మారుతీరామ బాలభక్త సమాజం అధ్యక్షుడు నెమలికంటి హనుమంతరావు పాల్గొన్నారు.

**అభిషేకాలు, అన్నసమారాధనలు..**

**పడమటిపాలెం(భట్టిప్రోలు):** మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, ఆకు పూజలు, కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిపించారు.పడమటిపాలెంలోని సుందరాంజనేయ స్వామికి.. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర కుమార్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి, తహసీల్దారు కార్యాలయం ఎదుట కొలువైన ప్రసన్నాంజనేయస్వామి, ఆలయాల్లో ఆకు పూజ, కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామికి వెంకటేశ్వర భజన సమాజం ఆధ్వర్యంలో ఆకు పూజ, భజన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాన్ని ఆత్మూరి మురళి పర్యవేక్షించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు. పల్లెకోనలో దాసాంజనేయస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలను పడమటి యానాది పర్యవేక్షించారు. రాచూరు గ్రామంలో కొలువైన సువర్చలా సమేత ఆంజనేయస్వామి దేవస్థాన అనువంశిక అర్చక స్వామి దీవి వేంకట నరసింహాచార్యులు పూజలు నిర్వహించారు. వెల్లటూరులో చెన్నకేశవస్వామి దేవాలయంలో కొలువైన వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు స్వామి మంగళ శాసనాలు, తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. పూజా కార్యక్రమాలను దేవస్థాన అనువంశిక అర్చక స్వామి తమిరిశ మారుతి నిర్వహించారు. ఆలయ ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. ఐలవరంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామికి సామూహిక హారతులిచ్చారు. అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**అభయాంజనేయునికి అభిషేకం..**

**పిట్టలవానిపాలెం:** పిట్టలవానిపాలెం శివారు కొత్తపేట గ్రామంలోని అభయాంజనేయస్వామికి విగ్రహం వద్ద దేగల రవిరెడ్డి దంపతులు, రుద్రరాజు వెంకట రవిరాజు దంపతులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గంగ, యమున, సరస్వతీ, హిమాలయాల నుంచి తీసుకొచ్చిన జలాలతో స్వామిని అభిషేకించారు. కొత్తపేట దేవాలయానికి రుద్రరాజు వెంకట రవి దంపతులు ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంతో పాటు పల్లకీని బహూకరించారు. అన్నదానం చేశారు. ఖాజీపాలెం శివారు కప్పలవారి పాలెం, అలకాపురం శివారు సత్యనారాయణపురం గ్రామాల్లో అభయాంజనేయస్వామి విగ్రహాల వద్ద హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు.

**పూజలందుకున్న పంచముఖ ఆంజనేయస్వామి**


**కర్లపాలెం:** హనుమజ్జయంతి ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మెటవారిపాలెం శివారులోని ఆంజనేయ స్వామి విగ్రహానికి, చింతాయపాలెంలోని అభయాంజనేయస్వామి, నడుంపాలెంలోని ఏకశిల ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి భారీ విగ్రహానికి, పెదపులుగువారి పాలెంలోని పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు. కర్లపాలెం అగ్రహారం, దమ్మనవారి పాలెం, యాజలి, ఎంపీ రాజుపాలెం, బుద్దాం, గ్రామాల్లోని ఆంజనేయస్వామి విగ్రహాలకు భక్తులు విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో 40 రోజులుగా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

**అప్పాలు, తమలపాకులతో ప్రత్యేక అలంకరణ**

**రేపల్లె రూరల్:** రైలుపేటలోని వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పాలు, తమలపాకులు, అరటి పండ్లతో ప్రత్యేక అలంకరణ గావించారు. ఈ సందర్భంగా అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, సహస్రనామ పూజ, హనుమత్ వ్రతం నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రైలుపేటలోని శ్రీ పట్టాభిరామస్వామి ఆలయంలో లక్ష తమలపాకుల పూజ, అష్టోత్తర, సహస్రనామ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మోర్లవారి పాలెం, పేటేరు, నల్లూరు, నల్లూరుపాలెం, బొంద లగరువు అడ్డరోడ్డులోని ఆంజనేయస్వామి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ప్రత్యేక అలంకరణ..**

**కొల్లూరు:** కొల్లూరు గౌడపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లూరు వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.



ప్రపత్త్యాంజనేయ స్వామి దర్శనం



ప్రసన్నాంజనేయ స్వామి



33 అడుగుల సుందరాంజనేయస్వామి



రాచూరు అంజనేయస్వామి



స్వామికి అభిషేకం నిర్వహణ



రైలుపేటలో స్వామికి ప్రత్యేక అలంకరణ



ప్రసన్నాంజనేయ స్వామి



పంచముఖ ఆంజనేయస్వామి

### నిరసనను విజయవంతం చేయాలి

**భట్టిప్రోలు:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలని వేమూరు నియోజకవర్గ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం భట్టిప్రోలు ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాపట్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పోరాటాల ద్వారా సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కార్మికులు వి.శ్రీనివాసరావు, తిరువీధుల రఘురామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

### 'కేంద్రియ'లో నూరుశాతం ఉత్తీర్ణత

**బాపట్ల అర్బన్:** ఇటీవల వెలువడిన సీబీఎస్ఈ ఫలితాల్లో కేంద్రియ విద్యాలయం ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సూర్యలంక విద్యార్థులు 12, 10 తరగతుల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో 12వ విద్యార్థులు బత్తుల తిరుమల తాండవ కృష్ణ, షేక్ అష్రఫ్, జేడే నవ్య ఉత్తమ ఉత్తీర్ణతతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 10వ తరగతి విద్యార్థులు సానసపురి రాజ్ వర్ధన్, ఆకాంక్ష చౌదరి, జేడే భవ్య మంచి మార్కులు సాధించారని ప్రిన్సిపల్ బొలిమెర నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 15 నుంచి 11వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి కలిగిన వారు స్కూల్‌కి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు.

### నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ

**నకిరికల్లు :** ఈనెల 15వతేదీ నుంచి 18వతేదీ వరకు డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా పథకం కొత్త రిజిస్ట్రేషన్‌లపై అభ్యంతరాల స్వీకరణ చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం తెలిపారు. రైతు భరోసాకేంద్రాల వారీగా అర్హుల, అనర్హుల జాబితాను ప్రదర్శించామన్నారు. గతేడాది లబ్ధిపొంది ప్రస్తుతం మరణించి ఉంటే వారి భర్త గాని, భార్యగాని నామినీగా నమోదు చేసుకోవచ్చన్నారు. దీనికోసం భూమిపత్రాలు, ఆధార్‌కార్డు, ఇతరపత్రాలను ఆయాగ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలన్నారు. అర్హుల, అనర్హుల జాబితాపై సందేహాలుంటే వీఏఏలకు తెలియజేస్తే డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసాపోర్టల్‌లో పొందురుస్తారని తెలిపారు.

### తెనాలిలో గంజాయి పట్టివేత

**తెనాలి రూరల్:** తెనాలి మండలం హాఫ్‌పేట సమీపంలో రూరల్ పోలీసులు ఆదివారం రాత్రి గంజాయిని పట్టుకున్నారు. నలుగురు యువకులు గంజాయి తెచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా నందివెలుగు–గుంటూరు మార్గంలో 2.1 కిలోల గంజాయిని గుర్తించారు. నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## వైభవంగా సీతారాముల ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణ విగ్రహాలు

**చెరుకుపల్లి:** గుళ్లపల్లి ఎస్టీ కాలనీలో నూతనంగ నిర్మించిన రామాలయం విమాన గోపుర ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. చిన జీయర్ స్వామి శిష్యులు, తెనాలి పీఠాధిపతులు నరేంద్ర రామానుజస్వామి, అగ్నిహోత్రం షేషాచార్యులు ప్రతిష్ఠ, అనుగ్రహ భాషణం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, శాసన సభ్యుడు అనగాని సత్యప్రసాద్, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, రావూరి ఆంజనేయులు, సమరసత సేవ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, జంజనం హేమశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా మొక్కజొన్న నష్ట నమోదు



తడిచిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీఏ అక్తర్ హుస్సేన్

**రేపల్లె రూరల్:** అకాల వర్షాలతో తడిచి పాడైన మొక్కజొన్న పంట రైతుల వివరాలు నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు రేపల్లె ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. అరవపల్లి, నల్లూరు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి, పంట నష్ట పరిహార నమోదు అంశాలను పరిశీలించి, మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించడం జరిగిందన్నారు. వర్షానికి తడవటంతో మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తటం, బూజు పట్టటం వంటి అంశాలను గుర్తించామన్నారు. వీఆర్వో, వీఏఏ, వీహెచ్‌ఏలు పంట నష్టాన్ని ఈ నెల 15 లోపు నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరవపల్లి వీఏఏ కె.సుమంత్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

### ■ ఊగిసలాడే ప్రయాణం..చేరునా గమ్యం





మన ఊరికి వచ్చి.. తమ ఫీట్లతో మెప్పించే సర్కస్ వాళ్లు ప్రస్తుతం తగ్గిపోయారు. కానీ, నిత్యం రోడ్ల మీద ఆటో ప్రయాణాల్లో ఇలా సర్కస్ ఫీట్లు చేసే వాళ్లు మాత్రం పెరిగిపోయారు. ఆదాయం కోసం ఆటో డ్రైవర్లు దినసరి, రైతుల కూలీలను ఆటోలో కుక్కుతుంటే.. చోటు లేక ప్రయాణికులు చువ్వలు పట్టుకుని వేలాడుతూ వెళ్తున్నారు. వెల్లటూరు–పెనుమూడి రహదారిలో ఈ ఆటో డ్రైవర్ సీటు పక్కన కింద కూర్చొని వేలాడుతున్న యువకుడుని చూడండి. ఆటో వెనుక సవారీ చేస్తున్నట్లు మరో వ్యక్తి ఇలా.. – భట్టిప్రోలు

## చట్టం కఠినం.. అమలులో అలసత్వం

- కాగితాలకే పరిమితమైన ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధం
- బాపట్ల పట్టణంలో యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల విక్రయం, వినియోగం
- అవగాహనతోనే సరి, తనిఖీల్లో అధికారుల ఉదాసీనత



బాపట్ల పట్టణం కారుమూరి హనుమంతరావు కాలనీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

**బాపట్ల అర్బన్:** ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణలో అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. పర్యావరణానికి పెనుముప్పుగా మారిన పాల్థిన్ సంచుల విక్రయాలు బాపట్ల పట్టణంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించిన, అమలు కావడం లేదు. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని పలువురు డీలర్లు పక్క రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున నిషేధిత పాల్థిన్ కవర్లను తీసుకొచ్చి, విక్రయిస్తున్నాయి. సంబంధిత అధికారులు అవగాహన పేరుతో.. తనిఖీలు చేయడం, జరిమానాలు విధించడం మరిచిపోయారు.

**చట్టం కఠినం..అమలులో అలసత్వం**

ప్లాస్టిక్ వ్యర్థాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చట్టం తీసుకొచ్చింది. జులై నుంచి ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కప్పులు ఫోర్కులు, ట్రేలు, ఇయర్ బర్డ్స్, బెలూన్‌లు, ఐస్ క్రీమ్ స్టిక్స్, స్ట్రాలు తదితర వస్తువుల తయారీ, రవాణా, వినియోగాన్ని నిషేధించింది. మొదట్లో 75 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉండగా.. డిసెంబర్ 31 నుంచి 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న వాటిని కూడా నిషేధిత జాబితాలో చేర్చింది. 120 మైక్రాన్ల కన్నా ఎక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లను వినియోగించాలన్న వాటిపై టీఎస్పీసీపీ ముద్ర ఉండాలని స్పష్టం చేసింది. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై గతంలో అధికారులు ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. అయితే వాటి విక్రయాలపై ఎక్కడా తనిఖీలు చేపట్టి, జరిమానాలు విధించి దాఖలాలు లేవు. ఇప్పటి వరకు ఆ దిశగా కూడా అధికారుల చర్యలు తీసుకోలేదు. ఇదే విషయంపై మున్సిపాల్ ఏఈ ఉమా మహేశ్వరావు వివరణ కోరగా.. ప్రజలకు, వ్యాపారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించామని చెప్పారు. తనిఖీల విషయంపై ఎక్కడా స్పష్టతనివ్వలేదు.

**పట్టుబడితే భారీగా జరిమానాలు**

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను తయారుచేసినా, విక్రయిస్తూ.. మొదటిసారి పట్టుబడితే జరిమానా విధించి, వస్తువులను స్వాధీనం చేసుకోవాలి. అదే వ్యాపారి రెండోసారి పట్టుబడితే రూ.2 లక్షల జరిమానాతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి, దుకాణాన్ని మూసివేయాలి. ప్లాస్టిక్ వినియోగిస్తూ.. దొరికితే రూ.500 జరిమానా విధించాలి. ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు మురుగు కాల్వల్లో, చెరువుల్లో పడేస్తే రూ.5వ వేలు జరిమానా విధిస్తారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాలిస్తే.. రూ.25 వేల జరిమానా విధించే అధికారం అధికారులకు ఉంది. ఈ కార్యాచరణను పగడ్బందీగా అమలు చేసేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినా.. ప్లాస్టిక్ వస్తువుల ప్రవాహాన్ని మాత్రం అరికట్టడంతో పూర్తిగా విఫలమయ్యారనే విషయం.. బాపట్ల పట్టణంలోని ఏ వీధిని చూసినా..కనిపించే ప్లాస్టిక్ వ్యర్థాలే చెబుతాయి.

**లైసెన్స్ రద్దు చేస్తాం..**



ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆకస్మిక తనిఖీలు చేస్తాం. ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తూ.. పట్టుబడితే దుకాణ లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

– ఎ.భానుప్రతాప్, కమిషనర్, బాపట్ల మున్సిపాలిటీ

## వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఇంగ్లీష్ టీచర్ మేరుగ రామకోటేశ్వరరావు

**వెల్లటూరు(భట్టిప్రోలు):** వెల్లటూరు ప్రాథమిక పాఠశాల (ఎల్‌ఈ)లో ఆదివారం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఐదు నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు ప్రారంభించారు. వేసవిలో విద్యార్థుల కోసం తరగతులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆంగ్లోపాధ్యాయులు మేరుగ రామకోటేశ్వరరావు విద్యార్థులకు ఇంగ్లీష్‌లో మెళకువలు నేర్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మేరుగ చలంబాబు, అంబేడ్కర్ యూత్ నిర్వాహకులు వై.శివ, కె.రాంబాబు, టి.రాకేష్, టి.కిషోర్, యు.చంటి తదితరులు పాల్గొన్నారు.